# కాకులు

రాత్రంతా వెన్నెల విహారం చేసిన తొలిసంధ్య చీర సవరించుకుంటూ మబ్బుల్లో కెళ్ళిపోతోంది. దినకరుడు మేఘాల్ని చీల్చుకుంటూ ముందుకు దూసుకువొస్తున్నాడు, చీకట్లు పారద్రోలుకుంటూ. ఆ చీకటి వెలుగులను తిలకిస్తూ, వేడి వేడి కాఫీని చప్పరిస్తూ బాల్కనీలో నుంచుంది. ఆమె కా పేరు తల్లిదండ్రులు ఎందుకు పెట్టారోగాని, అలా నీలిరంగు నింపుకున్న ఆకాశాన్నీ పాలనురుగుల్లాంటి మేఘ సమూహాన్నీ, చిరుకిరణాలతో ప్రకాశిస్తున్న ఉదయ భానుణ్ణి తిలకిస్తూ, గంటలు గడిపేస్తుంది నీలిమ. ఆ ప్రశాంతత ఆమె కెంతో ఇష్టం. అందుకే అందరికన్నా ముందే నిద్రలేచి, తనే స్ట్రాంగ్‌గా కాఫీ కలుపుకుని వేడి వేడి కాఫీని మెల్లమెల్లగా సిప్‌చేస్తూ అలా బాల్కనీలో నుంచుండిపోతుంది, ఇల్లంతా మేల్కొనేదాకా.

తన్మయత్వంతో తొలిసంధ్య అందాల్ని తిలకిస్తున్న నీలిమకి టెలిఫోన్ గణగణమని మోగడం, ఆమె ఆనందానికి అడ్డొచ్చి రసభంగాన్ని కలిగించినందుకు ఒళ్ళుమండుకొచ్చింది. విసుగ్గా రిసీవర్‌ని తీసి "హలో!" అంది చిరాగ్గా.

"నీలిమా! నేనే సువర్ణని మాట్లాడుతున్నాను. సారీ, పొద్దున్నే డిస్టర్బ్ చేస్తున్నాను" అంది.

"అబ్బా పొద్దున్నే ఈ సుత్తిమాస్టర్ ఫోన్ చేసిందే. చంపుతుంది ఒక పట్టాన ఫోన్ పెట్టక, ప్రొలాంగ్‌డ్ సుత్తి" అని మనసులో అనుకుంటూనే పైకి మాత్రం ఏమీ విసుగు కనబడనీయకుండా "ఏం వరవాలేదే, చెప్పు" అంది.

"నీలి! నాగేంద్ర పోయాడే పాపం" అంది సువర్ణ వొణుకుతున్న గొంతుతో.

"ఆ...."అంటూ ఆశ్చర్యంతో నోరుతెరిచింది నీలిమ. నీలిమకి నెత్తిమీద పిడుగు పడ్డట్టనిపించింది. గుండెలో బాకుతో పొడిచినట్టనిపించింది. కాస్సేపటికి తేరుకుని "ఎలా పోయాట్ట? ఎప్పుడు పోయాట్ట? అసలెందుకు పోయాట్ట? ఐ మీన్, ఏం జరిగిందట?" పిచ్చిదానిలా ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఆరు నెలలుగా మంచంలోనే వున్నాట్ట డాక్టర్లు కాన్సరు అని చెప్పార్ట. వాళ్ళింట్లో మాత్రం అవేమీకాదు, ఎవరో ఏదో చేతబడి చేశారూ అంటున్నారట. ఇంతకీ అతను హఠాత్తుగా హార్ట్ ఎటాక్‌తో పోయాడట. మా పక్కింటి డాక్టరు భుజంగరావుగారు చెప్పేరు ఇప్పుడే" అంది సువర్ణ.

"పాపం, సునీతికి పట్టుమని మూడు పదులు పూర్తిగా నిండలేదు. అంతలోనే వైధవ్యం! ప్రతిబంధకాలుగా ముక్కుపచ్చలారని ముగ్గురు బిడ్డలు కూడాను" అంది నీలిమ ఎంతో బాధపడిపోతూ.

"భగవంతుడు దానికి చాలా అన్యాయం చేశాడే. ఆసలే దానికి నగలూ, పూలూ, బొట్టూ, కాటుక ఇవన్నీ ఎంతో ఇష్టం. ఒక అరడజను నల్లపూసల గొలుసులున్నాయి దాని దగ్గర. రోజుకోటి మారుస్తూ వుంటుంది. ఒక్కరోజు అది తల్లో పూలులేకుండా వుండేదికాదు. నవ్వుతూ తుళ్ళుతూ చిలకా గోరింకల్లా తిరిగే ఆ జంటకి ఎవరి దిష్టి తగిలిందో పాపం, ఇలా అయిపోయింది" అంది సువర్ణ.

"నిజమేనే. ఈ వైధవ్యంలో కళావిహీనంగా దాని మొహం ఎలా చూడాలో ఏంటో. మరీ చాదస్తంగా పోక వాళ్ళవాళ్ళు, కనీసం దాని మొహాన ఒక నల్లచుక్కైనా వుంచితే బాగుండు. నిజంగా నాగేంద్రలాంటి ఉత్తముణ్ణి పోగొట్టుకోవడం, సునీతి దురదృష్టం. సరే.... ఎప్పుడు వెళదాం సునీతిని చూడ్డానికి?"

"బాడీని అట్టేసేపు వుంచకపోవచ్చును. అందరూ ఈ ఊళ్ళోనే వున్నారుగా. మనం పెందరాడే వెళ్ళి చూసొస్తే మంచిది."

"అలాగే, పదింటికల్లా వెళదామా?" అడిగింది నీలిమ.

"ఓ....కే! బై ......"

"బై ...."అని ఫోను పెట్టేసింది నీలిమ.

పది గంటలకల్లా సువర్ణ నీలిమ ఇంటికొచ్చింది.

"మనసంతా అల్లకల్లోలంగా వుందే. నాగేంద్ర రూపం, సునీతి రూపం కళ్ళకి కట్టినట్టు అడుగడుగునా కనిపిస్తోంది ముచ్చటైన జంట. నాగేంద్ర

అందగాడే కాదు, ఎన్నో అభ్యుదయ భావాలు కలవాడు. ఎన్నో సంస్థలకూ, ఎందరో నిర్భాగ్యులకూ ఎన్నో గుప్తదానాలు చేశాడు. భార్యా బిడ్డల్నీ పంచ ప్రాణాలుగా చూసుకున్నాడు. ఎంత దుఃఖంలో మునిగిపోయిందే సునీతి. ఎట్లా బతుకుతుందో ఏమో! ఆ పిల్లల గతి ఏమైపోతుందో!" బాధగా అంది నీలిమ.

"అదే! తలుచుకుంటేనే గుండె చెరువైపోతోంది" అంది బాధపడుతూ సువర్ణ.

జనం కిటకిట లాడిపోతున్నారు ఎవరినోట వింటున్నా "అయ్యో పాపం" అన్న మాట తప్ప మరోటిలేదు. అందర్నీ దాటుకుని సునీతిని చేరుకున్నారు నీలిమా, సువర్ణా.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపడిపోయింది సునీతి తల్లి చుట్టూ బిక్కు బిక్కు మంటూ ముడుచుకుని కుక్కపిల్లల్లా కూర్చున్నారు పిల్లలు ముగ్గురునూ.

నాగేంద్ర నిద్రపోతున్నట్టుగానే వున్నాడు. దుఃఖాన్నాపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చారు నీలిమా, సువర్ణలు. ఆ రోజంతా దాదాపు కార్యక్రమం అంతా పూర్తయ్యే వరకూ అక్కడే వున్నారు ఇద్దరూ.

క్యాలెండర్లో ఆరు పేజీలు మారాయి. అనేక పన్లవల్ల నీలిమా, సువర్ణలు సునీతిని కలుసుకోలేక పోయారు. అయితే డాక్టర్ భుజంగరావుగారి ద్వారా సువర్ణకి సునీతిని గురించిన విషయాలు చూచాయగా తెలీడం వల్ల అవి ఫోన్ చేసినప్పుడు నీలిమతో చెపుతూవుండేది. సునీతి దాదాపు నెల రోజులు పచ్చి మంచినీళ్ళు పుచ్చుకునేది కాదని, నీరసించిపోకుండా ఆమెకి బి. కాంప్లెక్స్ ఇంజక్షన్స్ చేయించేవారని చెప్పాడాయన. ఆ తరువాత నీలిమ భర్త కోటేశ్వర రావుగారికి హైదరాబాదు నుంచి కరీంనగర్‌కి ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల నీలిమా వాళ్ళు కరీంనగర్ వెళ్ళిపోయారు నీలిమ భర్త ఒక బ్యాంకు ఆఫీసరు. ట్రాన్స్‌ఫర్ వల్ల నీలిమ పూర్తిగా సునీతి విషయం మరిచిపోయింది.

క్యాలెండర్లో మరో ఆరు కాగితాలు మారాయి.

ఒకరోజున అనుకోకుండా హైదరాబాదులో జరిగిన ఒక పెళ్ళిలో సువర్ణా సునీతి కలుసుకున్నారు. ఆ పెళ్ళికి ప్రత్యేకించి నీలిమ కూడా వొచ్చింది. సునీతిని చూసిన నీలిమ గుర్తుపట్టలేకపోయింది. స్పృహకోల్పోయి నట్టుగా అలాగే స్థంభించిపోయి నుంచున్న నీలిమని చూసి సువర్ణ భుజం మీద చెయ్యి వేసి కుదుపుతూ, "ఏమిటే, అలా కొయ్యబారిపోయ్యావ్?" అంది.

"సు....నీ....తి....! సు....నీ....తి!" అంది తడబడుతూ. సువర్ణ పగలబడి నవ్వుతూ "ఓ....అదా! ఆమె కలియుగ పతివ్రత. నాగేంద్ర చనిపోయే ముందు ఆమెతో చెప్పాట్ట. తను పోయినా, తన చిహ్నమైన మట్టెలూ, మంగళ సూత్రాలు, నల్లపూసలూ, పూలూ ఏవీ తియ్యొద్దని. తను అలా తీసేసి బొట్టు లేకుండా అనాకారిగా వుంటే తన ఆత్మకు శాంతి వుండదనీనూ, అలా అని చెప్పి ఆమెచేత ప్రమాణం చేయించుకున్నాడట. అందుకే ఆమె అవేవీ తియ్యనివ్వలేదు. ఆమె తల్లి తండ్రీకూడా ఎంతో ప్రయత్నించారు. బంధువులు వెలివేశారు. అత్తమామలు దూషించారు. అయినా సునీతి ఎవ్వరికీ జంకలేదు. మొండిది, సిగ్గులేనిది అని ఏవేవో అన్నారు," గడగడా చెప్పేసింది సువర్ణ.

"అవునుమరి. అనరూ? ప్రాణప్రదమైన భర్తేపోగాలేనిది, ఈ సింగారాలుంటే ఎంత, లేకపోతే ఎంత?" అంది నీలిమ, సునీతిని అసహ్యించుకుంటూ.

"పైగా అన్నాట్ట నాగేంద్ర, నా పిల్లలముందు నువ్వు యేడుస్తూ కూర్చోకూడదు నువ్వు మూలకూర్చుని దుఃఖిస్తూ పిల్లల బాధ్యతని మరొకరి చేతిలో పెట్టడం నా కిష్టంలేదు. నీ నుదుట తిలకం అలాగే జ్యోతిలా వెలుగుతూ వుండాలి. నీ మెడలో నల్లపూసలు ఎల్లప్పుడూ నీకు దిష్టితగలకుండా నిన్ను కాపాడుతూ వుండాలి నీ గాజుల గలగల, వాగేవాళ్ళ నోళ్ళను మూయించాలి. నీ తల్లో పూలు నన్ను గుర్తుచెయ్యాలి అని "

"బాగుందే ఇవన్నీ సినిమా డైలాగుల్లా న్నాయి" అంది పకపకా నవ్వుతూ నీలిమ.

"య్యూ షటప్" అన్నారెవరో వెనకనుంచి, పళ్ళు కొరుకుతూ ఉద్రేకంగా. ఉలిక్కిపడి చూశారు నీలిమా, సువర్ణలు.

సునీతి పెద్దకూతురు విచిత్ర.

నీలిమని, సువర్ణని మింగేసేలా చూస్తోంది.

"మీరు నిజంగా మా అమ్మకి స్నేహితులేనా? దేముడి లాంటి మా నాన్న చెప్పిన మాటలు మీకు సినిమా డైలాగుల్లా ఉన్నాయా? సినిమాలో అయితే తువ్వాళ్ళు తడిసిపోయేలాగా కన్నీళ్ళు కార్చేసి, ముక్కు చీదుకుంటూ ఎంత గొప్పగా చెప్పాడే అని ఆ హీరోని పొగిడేస్తూ బయటికొచ్చే మీరు, నిజ జీవితంలో ఒక వ్యక్తి ఇంత ఉదాత్తంగా ప్రవర్తిస్తే హర్షించలేకపోగా హేళన

చేస్తున్నారా? మా కోసం మా నాన్నగారు కోరిన విధంగా మా అమ్మ ప్రవర్తిస్తే ఆమెని ఎగతాళి చేస్తున్నారా? మీరు మనుషులేనా? తోటి స్త్రీగా మీరు మాట్లాడ వలసిన మాటలేనా ఇవి? భర్త పోయిన స్త్రీకి బతికే హక్కు లేదా? తనూ చావాలా? సహగమనానికి దీనికి యేమిటి తేడా? సహగమనం ఒక్క రోజుతో తీరిపోతుంది. ఇది జీవితమంతా చస్తూ బతకమంటుంది అదేనా మీరు కోరేది? అసలే తండ్రిని పోగొట్టుకున్న బిడ్డలు, తల్లిని కూడా పోగొట్టుకుంటే వాళ్ళ గతేం కావాలన్న ఆలోచన కూడా లేదా మీకు? మీరంతా కాకుల్లాంటి వాళ్ళు!" అంటూ ఆవేశంతో ఇంక అక్కడ నిలబడలేక వెళ్ళిపోయింది.

నీలిమా, సువర్ణలు సిగ్గుతో కుచించుకు పోయారు, అందరి కళ్ళూ వాళ్ళ మీదే వున్నాయని తెలిసి. "కుంకం తీసుకోండి" అంటూ ఎవరో ఒక అమ్మాయి అక్కడికి అందరికీ బొట్లు పెట్టుకుంటూ రావడంతో, తలవంచుకుని ఆమె ఇచ్చిన పసుపూ కుంకుమలు అందుకున్నారు నీలిమా, సువర్ణా. విచిత్ర వెళ్ళిపోయినా ఆమె మాటలు వారి చెవుల్లో రింగుమంటూనే వున్నాయి. నీళ్ళు నిండిన కళ్ళతో సునీతిని వెతుక్కుంటూ వెళ్ళి, పందిట్లో వున్న సునీతిని గట్టిగా కౌగిలించుకుంది నీలిమ.

"నన్ను క్షమించు సునీతీ! నీ గురించి పిచ్చిగా మాట్లాడుతూ వుంటే నీ కూతురు విచిత్ర నా కళ్ళు తెరిపించింది" అని చెప్పాలనుకుంది. కాని నోరు పెగల్లేదు. మౌనంగా జాలి చూపులు చూసింది. సునీతి దేనికి చలించనట్టు నిబ్బరంగా నుంచుంది, పక్కనున్న ఇద్దరు బిడ్డలూ వినోదినీ, వివేక్‌ల తలలు నిమురుతూ!

*